

మళ్లీ మొదటికి వచ్చినట్లేనా?

కేయూలో 2010లో నియమితులైన అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకంపై వివాదం కొనసాగుతోంది. పలువురు కోర్టుకెళ్లడంతో ప్రక్రియ మళ్లీ మొదటికొచ్చింది. - 8లో▸



ఓటమిని గెలుపుగా మలుచుకోవాలి

- 8లో▸

క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓడిపోయిన వారు గెలుపుకోసం మళ్లీ ప్రయత్నించాలని మంత్రి సీతక్క సూచించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
$31^0/23^0$

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు కురుస్తాయి. మధ్యాహ్నం వేళ సాధారణంగా ఉంటుంది. సాయంత్రం సమయంలో ఆహ్లాదంగా ఉంటుంది.



అధ్యయన యాత్రకు సకుటుంబ సమేతంగా..!

నేటినుంచి 19 వరకు ఇండోర్, జైపూర్ సిటీల్లో కార్పొరేటర్ల స్టడీ టూర్

- 'గ్రేటర్' కార్పొరేటర్ల సతులు, పతులు పయనం..
- వీరి సేవలకు 23 మంది అధికారులు, ఉద్యోగులు
- రూ.50 లక్షల స్మార్ట్ సిటీ నిధుల కేటాయింపు
- పాలకవర్గం గడువు ముగుస్తున్న తరుణంలో ఈ పర్యటనపై నగరవాసుల విస్మయం

వరంగల్ అర్బన్ : పాలకవర్గం గడువు దగ్గరపడుతోంది. ఓవైపు నగరంలో ఏ అభివృద్ధి కార్యక్రమం పూర్తికాలేదు. నిధుల లేమి ఒకవైపు వేధిస్తుండగా ఈ సమయంలో కార్పొరేటర్లు సకుటుంబ సమేతంగా స్టడీ టూర్‌కు వెళ్తుండడం విస్మయానికి గురిచేస్తోంది. ఇందుకోసం రూ.50 లక్షల స్మార్ట్ నిధులు కేటాయించి మరీ విమానయానం, అన్ని ఖర్చులు పెడుతుండడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆదివారం మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో రెండు బృందాలుగా ప్రైవేట్ ఏసీ బస్సుల్లో పయనమై, హైదరాబాద్ శంషాబాద్‌కు ఎయిర్‌పోర్ట్ నుంచి విమానయానంలో మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ సిటీని సందర్శిస్తారు. తదుపరి రాజస్థాన్‌లోని జైపూర్‌కి వెళ్లి అక్కడి పరిస్థితులు పర్యవేక్షించనున్నారు. ఈనెల 19వ తేదీ వరకు వీరి యాత్ర కొనసాగనుంది. కేరళ సదస్సులో ఉన్న నగర మేయర్ శనివారం నగరానికి చేరుకోగా, వీరితో భాగస్వామి కానున్నారు.

7 నెలల పదవి కాలంలో ఏం చేస్తారు?

స్మార్ట్‌సిటీ పథకం గడువు ముగిసి ఆరు నెలలు దాటింది. ఐదేళ్ల వ్యవధిలో ప్రాజెక్టులు పూర్తి కాకపోవడంతో కేంద్ర ప్రభుత్వం ఏడాదిలోగా నిధుల మేరకు పనులు పూర్తి చేయాలని నిబంధన పెట్టారు. ఇంతవరకు బాగానే ఉన్నా 53 నెలల పాటు స్టడీ టూర్‌కు వెళ్లలేదు. డివిజన్లలో కార్పొరేటర్లు క్రియాశీలకంగా వ్యవహరించిన దాఖలాలు లేవు. మరో 7 నెలలు గడిస్తే పాలకవర్గ పదవీ కాలం ముగుస్తుంది. సాధారణంగా కౌన్సిల్ సమావేశాల్లో, బతుకమ్మ, దసరా పర్వదినాల సందర్భంగా కార్పొరేటర్లకు నజరానాలు ఇవ్వడం రివాజు. ఈ నేపథ్యంలో టూర్‌లో క్షేత్రస్థాయిలో ఏ మేరకు పరిశీలించి, అమలు జరుగుతాయనే ప్రశ్నలు వెలువడుతున్నాయి. నగర మేయర్ గుండు సుధారాణి, డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్, అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష కార్పొరేటర్లు అధ్యయన యాత్రకు వెళ్తున్నారు. 66 మంది కార్పొరేటర్లలో 55 మంది ఈ టూర్‌కు వెళ్తుండగా, మరో 11 మంది వివిధ కారణాలతో దూరంగా ఉంటున్నారు. వీరి సపర్యలు, ఏర్పాట్ల కోసం బల్దియాకు చెందిన 23 మంది అధికారులు, సిబ్బంది కలిసి ఈ టూర్‌లో వెళ్తుండడంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆ ఖర్చు రూ.అర కోటి

బల్దియాకు చెందిన స్మార్ట్‌సిటీ నిధులను రూ.50లక్షలు కేటాయిస్తూ గత కౌన్సిల్‌లో తీర్మానం చేశారు. ఈ నిధులను బస్సు యాత్రలు, విమానయానం, బస, భోజన తదితర ఖర్చులకు వెచ్చిస్తారు. ఇకపోతే మహిళా కార్పొరేటర్లతోపాటు వారి భర్తలు టూర్‌కు వెళ్తున్నారు. పదవులు లేనందున పతులకయ్యే ఖర్చు మాత్రం పాలకవర్గం పెద్దలు భరిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. గతంలో 66 మంది కార్పొరేటర్లకు రూ.16.50లక్షలతో మొబైల్ ఫోన్లను కొనుగోలు చేసి అందజేశారు. ఒకవైపు గత నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. మరికొన్ని రోజులు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావారణ శాఖ ప్రకటించింది. మరోవైపు ఈ క్లిష్ట పరిస్థితుల నడుమ నగర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాల్సిన ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది వాటిని గాలికి వదిలేసి స్టడీ టూర్‌కు వెళ్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమేనని నగర ప్రజలు మండిపడుతున్నారు. స్టడీ టూర్‌పై నగర మేయర్, కమిషనర్ తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

న్యూస్‌రీల్

సమస్యలు పరిష్కరిస్తాం



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ లా కళాశాల ఐదేళ్ల కోర్సు విద్యార్థుల సమస్యలు దశల వారీగా పరిష్కరిస్తామని రిజిస్ట్రార్ రామచంద్రం హామీ ఇచ్చారు. ఈనెల 12న ఐదేళ్ల లాకోర్సుల విద్యార్థులు తమ సమస్యలు పరిష్కరించాలని ఆందోళన చేసిన నేపథ్యంలో ఆయా విద్యార్థులతో శనివారం పరిపాలనాభవనం వద్ద చర్చలు జరిపారు. అయినప్పటికీ విద్యార్థులు వినకుండా పరిపాలనా భవనం వద్ద ధర్నా నిర్వహించారు. మళ్లీ కొంతసేపటికి రిజిస్ట్రార్ రామచంద్రం విద్యార్థులతో మాట్లాడారు. వీసీ ప్రతాప్‌రెడ్డి ఈనెల 23న కేయూకు రానున్నారని సమస్యలను వీసీ దృష్టికి తీసుకెళ్లి దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. వినతిపత్రాన్ని రిజిస్ట్రార్ రామచంద్రంకు అందజేశారు. రిజిస్ట్రార్ వెంట పరీక్షల నియంత్రణాధికారి కె.రాజేందర్, యూనివర్సిటీ లా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సుదర్శన్, కేయూ పాలకమండలి సభ్యులు బి.సురేశ్‌లాల్, లా హాస్టల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ చల్లా శ్రీనివాస్ ఉన్నారు. విద్యార్థుల ఆందోళన నేపథ్యంలో.. కేయూ పోలీస్‌స్టేషన్ పోలీస్ అధికారులు కూడా అక్కడికి విచ్చేశారు.

17 నుంచి స్వస్త్‌నారీ స్వశక్తి పరివార్



ఎంజీఎం: ఈనెల 17 నుంచి జిల్లావ్యాప్తంగా 'స్వస్త్‌నారీ సశక్తి పరివార్' కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య కేంద్రాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌ఓ అప్పయ్య తెలిపారు. శనివారం కలెక్టర్‌లోని ఐడీఓసీ కార్యాలయంలో పల్లెదవాఖాన వైద్యాధికారులు, టీబీ నోడల్ పర్సన్స్, హెల్త్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా డీఎంహెచ్‌ఓ అప్పయ్య మాట్లాడుతూ.. 17 నుంచి ఆరోగ్య కేంద్రాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించే సమయంలో ఆప్రాంతంలోని మహిళలను పరీక్ష శిబిరాలకు హాజరయ్యేలా చూడాలన్నారు. ఈశిబిరాల్లో స్పెషలిస్టు వైద్యులు అందుబాటులో ఉండనున్న నేపథ్యంలో సమస్యలు ఉన్నవారిని గుర్తించి వారికి తగిన పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. డెంగీ పాజిటివ్ వచ్చిన ప్రాంతాల్లో లార్వా నియంత్రణ చర్యలు, ఫీవర్ సర్వే చేపట్టాలన్నారు. టీబీ ముక్త్‌భారత్ అభియాన్ 8 రిస్క్ గ్రూపుల వారికి స్క్రీనింగ్, ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించాలన్నారు. జిల్లా టీబీ నియంత్రణాధికారి డాక్టర్ హేమబిందు, అదనపు డీఎంహెచ్‌ఓ మదన్‌మోహన్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

నగర గోడు.. ఒడవని తీరు!

గ్రేటర్‌ను పట్టిపీడిస్తున్న సమస్యలు

- గుంతలు తేలిన ఫ్లై ఓవర్లు
- రోజురోజుకూ తీవ్రమవుతున్న కుక్కల బెడద
- వెలగని వీధిలైట్లు.. రాత్రివేళ ప్రమాదకరంగా ప్రయాణం
- సమస్య చిన్నగా కనిపించినా.. నగరవాసులపై తీవ్ర ప్రభావం

గ్రేటర్ వరంగల్ మహానగరం రోజురోజుకూ విస్తరిస్తోంది. అందుకనుగుణంగా సదుపాయాల కల్పనలో అటు ప్రభుత్వం, ఇటు అధికార యంత్రాంగం మీనమేషాలు లెక్కిస్తోంది. ఉన్న సదుపాయాలను అయినా సరిగ్గా నిర్వహించలేక.. ఏదైనా మరమ్మతు వస్తే రోజుల తరబడి పట్టించుకోకపోవడంతో నగరవాసులు అవస్థలు పడుతున్నారు. వీధిలైట్లు, రోడ్లపై గుంతలు, ఖాళీ స్థలాలతో దోమల విజృంభణ.. చూడడానికి చిన్న సమస్య అనిపించినా వాటి ప్రభావం తీవ్రంగా ఉండడంతో కాలనీలవాసులు ఇబ్బందులు పడుతున్నారు. నగర పరిధి పలు కాలనీల్లో నెలకొన్న పలు సమస్యల సమాహారమే ఈ కథనం.

ఫోకస్ సాక్షి ఫోకస్

ప్రయాణం.. జరభద్రం

కాజీపేట అర్బన్: వామ్మో ఖమ్మం ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై ప్రయాణం అంటేనే జంకుతున్నారు. కాజీపేట, హనుమకొండ, వరంగల్ ట్రైసిటీకి అనుసంధానంగా ఉన్న ఖమ్మం ఫ్లైఓవర్ బ్రిడ్జి గుండా నిత్యం ద్విచక్ర, ఆటో, కారు, భారీ వాహనాలు కాజీపేట నుంచి కడిపికొండ మీదుగా, హంటర్‌రోడ్డు నుంచి వరంగల్‌కు, ఖమ్మంకు నిత్యం ప్రయాణం కొనసాగిస్తుంటాయి. కాగా.. బ్రిడ్జిపై ఏర్పడిన గుంతలతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఏళ్ల క్రితం నిర్మించిన ఖమ్మం ఫ్లై ఓవర్ బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుని గుంతలమయంగా మారిపోయింది. గుంతల నుంచి బ్రిడ్జి నిర్మాణానికి వాడిన ఇనుప చువ్వలు ప్రమాదకరంగా మారాయి. ఓ వైపు గుంతలు మరో వైపు గుంతల్లో నుంచి బయటకు చొచ్చుకు వస్తున్న ఇనుప చువ్వలతో వాహనాలు మరమ్మతుల బారిన పడడమే కాకుండా ప్రమాదాలబారిన పడుతున్నాయి.



ఖమ్మం ఫ్లై ఓవర్‌పై ప్రమాదకరంగా గుంతలు


మరమ్మతులు చేపట్టాలి..



హంటర్‌రోడ్డు మీదుగా ఖమ్మం వెళ్లేందుకు ఖమ్మం ఫ్లై ఓవర్ మీదుగా ప్రయాణిస్తుంటే, బ్రిడ్జిపై ఏర్పడిన గుంతల్లో వాహనాలు పడిపోతున్నాయి. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి వేళల్లో బ్రిడ్జిపై ఉన్న విద్యుద్దీపాలు సరిగ్గా వెలగకపోవడంతో వాహనాల వెలుగులోనే ప్రయాణం కొనసాగించాల్సి వస్తోంది. తక్షణమే అధికారులు చొరవ తీసుకుని బ్రిడ్జిపై ఏర్పడిన గుంతలకు, విద్యుత్ దీపాలకు మరమ్మతులు చేపట్టాలి. - పెరుగు సురేశ్, న్యూశాయంపేట

హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలి..

కాజీపేట అర్బన్: హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేసి మా ప్రాణాలు కాపాడండి అంటూ కడిపికొండలోని రాజీవ్ గృహ కల్ప, ఇందిరమ్మ కాలనీవాసులు వేడుకుంటున్నారు. కాజీపేట నుంచి హైదరాబాద్ వెళ్లే జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న కడిపికొండ టు ఖమ్మం బైపాస్ రోడ్డుకు ప్రధాన ద్వారంగా రాజీవ్ గృహకల్ప సముదాయంలోని ప్రధాన రోడ్డు నిలుస్తోంది. వీధి దీపాలు, హైమాస్ట్ లైట్ లేక చీకట్లోనే నిత్యం ప్రయాణాలు కొనసాగుతున్నాయి. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. భారీ వెహికిల్స్ నడిచే ఈ దారిలో చీకటి ఆవరించి ఉండడంతో వాహనదారులు, స్థానికులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణం కొనసాగిస్తున్నారు. హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేస్తే వాహనదారులు ప్రమాదాల బారిన పడకుండా ఉంటారని స్థానికులు పేర్కొంటున్నారు.



వాహనాల లైట్లతో ప్రయాణం

అలంకారప్రాయంగా ఎఫ్‌సీఐ క్వార్టర్లు

కాజీపేట: కాజీపేట భారత ఆహారసంస్థ (ఎఫ్‌సీఐ) గిడ్డంగుల్లో పనిచేసే ఉద్యోగుల కోసం నిర్మించిన నివాస గృహాలు (క్వార్టర్లు) నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. 62వ డివిజన్ రహమత్ నగర్ కాలనీ శివారులో ఉన్న గృహాలు ఉపయోగంలో లేక పాములు, తేళ్లకు ఆవాసాలుగా మారుతున్నాయి. ఈ గృహాల్లో ఎవరూ ఉండకపోవడం వల్ల నిర్వహణ లేక పరిసర ప్రాంతాలు అస్తవ్యస్తంగా మారాయి. చెట్లు, చెదారం పేరుకుపోయి దోమలు విజృంభిస్తున్నాయి. వీటివల్ల ఇళ్లలో ఉండలేక పోతున్నామని విష్ణుపురి, రహమత్‌నగర్ కాలనీవాసులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. 1995లో ఎఫ్‌సీఐలో పనిచేసే ఉద్యోగుల కోసం రూ.2 కోట్లకు పైగా వ్యయం చేసి 40 కుటుంబాలు నివాసం ఉండేలా 5 భవనాలు నిర్మించారు. ఒక్కో క్వార్టర్‌లో 8 కుటుంబాలు ఉండేలా అందమైన భవనాలు నిర్మించారు. పక్కనే ఎఫ్‌సీఐ ఉండడంతో నిత్యం లక్క పురుగులు రావడం, ఇంటి అద్దె హెచ్‌ఆర్‌ఏ కంటే ఎక్కువగా ఉండడంతో ఈ క్వార్టర్లలో ఉండడానికి సిబ్బంది ససేమిరా అంటున్నారు.



కాజీపేటలో వృథాగా ఉన్న ఎఫ్‌సీఐ క్వార్టర్స్

ఖాళీ స్థలం.. ట్రాఫిక్ అస్తవ్యస్తం

కాజీపేట: కాజీపేటలోని డిజిల్ కాలనీ నుంచి ఫాతిమా నగర్ మీదుగా నిట్ వరకు రోడ్లకు ఇరువైపులా రహదారుల వెంట ఖాళీగా ఉన్న స్థలాల్లో దుకాణాలు నిర్మిస్తే హాకర్ల సమస్య తీరుతోందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఈ స్థలాల్లో కొందరు వ్యాపారాలు కొనసాగిస్తుండగా.. ఇక్కడ బలం ఉన్నోడిదే రాజ్యం అన్నట్లుగా పరిస్థితి మారింది. రోడ్లపైనే విచ్చలవిడిగా దుకాణాలు ఏర్పాటు చేసుకుని ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తున్నా.. పట్టించుకునేవారు లేకుండా పోయారు. మున్సిపల్ అధికారులతోపాటు ట్రాఫిక్ పోలీసులు ఇటువైపు కన్నెత్తి చూడడం లేదు. అధికారులు పట్టించుకుంటే కార్పొరేషన్‌కు రూ.5 లక్షలకు పైగా ఆదాయం వస్తుంది. ఈస్థలాలు ఆక్రమణకు గురవకముందే అధికారులు స్పందించాలి.



కాజీపేట రైల్వే క్వార్టర్స్ ఎదురుగా ఖాళీగా ఉన్న స్థలం

మడిగెలు నిర్మించడమే ఉత్తమం...



రహదారుల వెంట ఉన్న ప్రభుత్వ స్థలాల్లో మడిగెలు నిర్మించి ఇవ్వడమే ఉత్తమం. దీని వల్ల మున్సిపల్ కార్యాలయానికి ఆదాయం, చిరువ్యాపారులకు సరైన అడ్డాలు నిర్మించి ఉపాధి కల్పించినట్లు అవుతుంది.
- పాలడుగుల రామస్వామి, సోమిడి

వెంటాడుతున్న వీధికుక్కలు

ఖిలా వరంగల్: వరంగల్ 39వ డివిజన్ విద్యానగర్ కాలనీలో వీధి కుక్కలు పెట్రేగిపోతున్నాయి. చిన్నా పెద్దా తేడా లేకుండా ఒంటరిగా కనిపిస్తే చాలు విచక్షణా రహితంగా దాడికి పాల్పడుతున్నాయి. కుక్కల దాడిలో ఇప్పటికే కొందరు పిల్లలు గాయాల పాలై ఆస్పత్రిలో చికిత్స తీసుకుని ప్రాణాలతో బయటపడ్డారు. కాగా.. వరంగల్ ఫోర్ట్ రోడ్డుకు ఇరువైపులా చికెన్, మటన్ విక్రయ షాపులు ఉన్నాయి. రహదారులపై మాంసం వ్యర్థాలు, చెత్త వేస్తుండడంతో వీధి శునకాలు ఎక్కువగా వాటి కోసం గుంపులుగా తిరుగుతున్నాయి. వీధి కుక్కలను సంరక్షణ కేంద్రానికి తరలించాలని బల్దియా అధికారులకు ఫిర్యాదు చేసినా బేఖాతర్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కల బారి నుంచి కాపాడాలని స్థానికులు వేడుకుంటున్నారు.



విద్యానగర్‌లో అంతర్గత రోడ్డుపై తిష్టవేసిన వీధికుక్కలు

కట్టడికి చర్యలు తీసుకోవాలి..



వరంగల్ ఫోర్ట్ విద్యానగర్ కాలనీలో వీధి కుక్కలు పెట్రేగిపోతున్నాయి. రాత్రయితే చాలు.. కుక్కలు కాలనీలో గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. ప్రజలను అరుపులతో బెంబేలెత్తిస్తున్నాయి. అధికారులు వెంటనే స్పందించి వీధికుక్కల బారి నుంచి కాపాడాలి. - అచ్చ వినోద్‌కుమార్, కాలనీ ప్రతినిధి, వరంగల్

ధర్మకర్తలను నియమించే స్వేచ్ఛ లేదా?

- నాయిని అదృష్టం కొద్ది గెలిచాడు
- మంత్రి కొండా సురేఖ



డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి కొండా సురేఖ

వరంగల్ చౌరస్తా: 'రాష్ట్ర మంత్రి హోదాలో ఇద్దరు ధర్మకర్తలను నియమించే స్వేచ్ఛ నాకు లేదా? అధిష్టానం సూచించిన వారికే కేటాయించా' అని దేవాదాయ ధర్మదాయ, పర్యావరణ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రశ్నించారు. శనివారం వరంగల్ ఓ సిటీలో విలేకరులతో మంత్రి సురేఖ మాట్లాడారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అదృష్టం కొద్ది గెలిచాడని, ఆయనపై తాను కామెంట్ చేయాలనుకోవట్లేదని పేర్కొన్నారు. తనపై నాయిని చేసిన వ్యాఖ్యలను ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానన్నారు.

రూ.3కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

తూర్పు నియోజక వర్గంలో మూడు డివిజన్లలో రూ.3 కోట్ల అభివృద్ధి పనులకు మంత్రి కొండా సురేఖ శంకుస్థాపన చేశారు. కాశిబుగ్గలో రూ.1.50 కోట్లతో నిర్మించే అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ భవన నిర్మాణానికి, రూ.50 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులు, 26వ డివిజన్ గిర్మాజీపేటలో రూ.50 లక్షలతో సీసీ రోడ్డు, 21వ డివిజన్ ఎల్ బీ నగర్‌లో రూ.50 లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్డు, డ్రెయిన్ పనులు ప్రారంభించారు. ప్రజా సమస్యలు తెలుసుకుని, వినతి పత్రాలు స్వీకరించారు. ఈఅభివృద్ధి కార్యక్రమాల్లో కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మైక్రో ఆర్టిస్ట్ అజయ్‌కుమార్‌కు ఎక్స్‌లెన్స్ అవార్డు



అజయ్‌కుమార్‌కు ఎక్స్‌లెన్స్ అవార్డు అందజేస్తున్న ఇండియా ప్రతినిధి డాక్టర్ మనీష్‌కుమార్

హన్మకొండ కల్చరల్: వరంగల్ గిర్మాజీపేటకు చెందిన మైక్రో ఆర్టిస్ట్ మట్టెవాడ అజయ్‌కుమార్‌కు అంతర్జాతీయ గౌరవం లభించింది. ఈమేరకు శనివారం గ్లోబల్ బుక్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇంగ్లాండ్, ఇండియా ప్రతినిధి డాక్టర్ మనీష్‌కుమార్ స్వయంగా వరంగల్‌లోని అజయ్‌కుమార్ నివాసానికి వచ్చి సర్టిఫికెట్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ అవార్డు, ట్రోఫీ, రికార్డు బుక్‌ను అందజేశారు. సూక్ష్మశిల్పకళలో అసాధారణ ప్రతిభకనబర్చినందుకు ఈఅవార్డు వచ్చిందని అజయ్‌కుమార్ తెలిపారు.

మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారానికి కృషి

జాతీయ లోక్ అదాలత్ ప్రారంభంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్



మధ్యవర్తిత్వంతో కలిగే లాభాల బ్యానర్ ప్రారంభించి మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్

వరంగల్ లీగల్ : మధ్యవర్తిత్వం ద్వారా కేసుల పరిష్కారానికి న్యాయవాదులు, కక్షిదారులు కృషి చేయాలని హైకోర్టు న్యాయమూర్తి, ఉమ్మడి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ కె.లక్ష్మణ్ అన్నారు. శనివారం ఉమ్మడి వరంగల్ జిల్లా కోర్టులోని 10 కోర్టుల భవనంలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. న్యాయమూర్తులు పాత సివిల్ కేసులపై దృష్టి సారించాలని, వాటి పరిష్కారానికి మధ్యవర్తిత్వం వహించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా న్యాయసేవాధికార సంస్థ బిల్డింగ్ ముందు మధ్యవర్తిత్వం ద్వారా జరిగే లాభాలు అనే బ్యానర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు న్యాయసేవాధికార సంస్థ చైర్మన్‌లు వీబీ నిర్మలా గీతాంబ, పట్టాభిరామారావు, కార్యదర్శులు ఎం.సాయికుమార్, క్షమాదేశ్‌పాండే, హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్, న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ మెంబర్లు, ఉమ్మడి బార్ అసోసియేషన్ అధ్యక్షులు, న్యాయవాదులు వివిధ బ్యాంకుల అధికారులు, ఇన్సూరెన్స్ అధికారులు, కక్షిదారులు పాల్గొన్నారు.



న్యాయవాదులకు శిక్షణ అవసరమే

- హైకోర్టు జడ్జి జస్టిస్ కె.లక్ష్మణ్
- డీసీసీబీ భవన్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు

- 8లో▸

నగరాభివృద్ధికి సీఎం ప్రత్యేక చొరవ

కేరళ అర్బన్ కాన్‌క్లేవ్-25 సదస్సులో మేయర్ గుండు సుధారాణి



సదస్సులో నగర మేయర్ గుండు సుధారాణి

వరంగల్ అర్బన్: వరంగల్ నగరాభివృద్ధి కోసం సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని మేయర్ గుండు సుధారాణి అన్నారు. కేరళ ప్రభుత్వం తొలిసారిగా కేరళ అర్బన్ కాన్క్లేవ్-25 మేయర్‌ల ఫోరం సదస్సు శనివారం ముగిసింది. సదస్సులో సుధారాణి మాట్లాడుతూ.. నూతన మాస్టర్ ప్లాన్, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణానికి రూ.4,170 కోట్లు, విమానాశ్రయం కోసం వేగంగా నిర్ణయాలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. వ్యర్థాల నుంచి 6 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి, ఎఫ్ ఎస్‌టీపీలు, ఎస్టీపీలు, బయోమైనింగ్, బయో, విండో కంపోస్టుల యూనిట్ల ఏర్పాటు, కూరగాయల వ్యర్థాలతో బయో గ్యాస్ ప్లాంట్లతో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్, ప్రాపర్టీ టాక్స్ వసూళ్ల క్యూ ఆర్ కోడ్, బిల్డ్ నౌ ద్వారా భవనాల అనుమతులు తదితర విధానాలను అవలంబిస్తున్న తీరును వివరించారు.

అథ్లెటిక్స్ మీట్ ప్రతిష్టాత్మకంగా నిర్వహిద్దాం

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో వచ్చే నెల (అక్టోబర్) 16 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలపై వివిధ క్రీడా సంఘాలతో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి శనివారం సమీక్ష నిర్వహించారు. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి సుమారు వెయ్యి మంది క్రీడాకారులు, టెక్నికల్ అఫీషియల్స్ పాల్గొననున్నట్లు క్రీడా సంఘాల బాధ్యులు ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డికి వివరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ.. పోటీల వివరాల్ని సీఎం రేవంత్‌రెడ్డికి వివరించేందుకు ఈనెల 15 లేదా 16 తేదీల్లో స్వయంగా కలవనున్నట్లు తెలిపారు.

డీవైఎస్ఓకు ఎమ్మెల్యే అభినందనలు

ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు మలేషియాలో జరగనున్న అంతర్జాతీయ క్రీడా సదస్సుకు హాజరు కానున్న డీవైఎస్ఓ గుగులోతు అశోక్‌కుమార్‌ను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అభినందించారు. హనుమకొండ బాలసముద్రంలోని ప్రజాభవన్‌లో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి శనివారం డీవైఎస్ఓ అశోక్‌కుమార్‌ను శాలువాతో సత్కరించారు. మారుమూల గ్రామీణ ప్రాంతం నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు ఎదిగిన అశోక్ కుమార్ క్రీడాకారులకు ఆదర్శమన్నారు. అంతకు ముందు క్రీడా సంఘాలు, డీఎస్ఏ కోచ్‌ల ఆధ్వర్యంలో జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో అశోక్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్స్ సంఘం అధ్యక్షుడు అజీజ్‌ఖాన్, అథ్లెటిక్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు వరదరాజేశ్వర్ రావు, బాడ్మింటన్ సంఘం జిల్లా కార్యదర్శి రమేశ్ రెడ్డి, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ మామిండ్ల రాజు తదితరులున్నారు.



డీవైఎస్ఓ అశోక్‌కుమార్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

క్లుప్తంగా

జాతీయ లోక్ అదాలత్‌కు అపూర్వ స్పందన

వరంగల్ లీగల్: వరంగల్, హనుమకొండ జిల్లాల కోర్టు ప్రాంగణాల్లో శనివారం వేర్వేరుగా ఏర్పాటు చేసిన జాతీయ లోక్ అదాలత్‌కు అపూర్వ స్పందన లభించింది. కేసుల పరిష్కారానికి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 10 బెంచ్‌లు ఏర్పాటు చేశారు. ఇందులో వరంగల్ – 8, నర్సంపేట–2 బెంచ్‌లు ఏర్పాటు చేసి 5,938 పెండింగ్ కేసులు ఛేదించారు. ఇందులో సివిల్ 26, ఎంవీఓపీ 24 కేసులకు రూ.2,15,44,176లు, క్రిమినల్ కేసులు 5912, బ్యాంకు పీఎల్‌సీ కేసులు 76,720 కేసులకు రూ.2,28,82,709లతో పరిష్కరించారు. అలాగే, హనుమకొండ జిల్లా వ్యాప్తంగా 8 బెంచ్‌లు ఏర్పాటు చేసి 56,867 పెండింగ్ కేసులు పరిష్కరించారు. ఇందులో సివిల్ కేసులు 71, ఎంవీఓపీ 62 కేసులకు రూ.7,31,55,963లు, క్రిమినల్ కేసులు 18,412, బ్యాంకు పీఎల్‌సీ 38,379 కేసులకు రూ.1,15,56,828లతో పరిష్కరించారు. ఈజాతీయ లోక్ అదాలత్‌లో వినూత్న లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ డేవిడ్ రాజ్ కుమార్ సుమారు 300 పులిహోర ప్యాకెట్లను కక్షిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు, కక్షిదారులు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు జయశ్రీ, రమాదేవి పాల్గొన్నారు

దంపతులను కలిపిన లోక్ అదాలత్..



అనూష, అనిల్‌ను అభినందిస్తున్న జిల్లా జడ్జి మహమ్మద్ అబ్దుల్ రఫీ

మహబూబాబాద్ రూరల్ : కుటుంబ తగాదాలతో కొంతకాలంగా దూరంగా ఉంటున్న దంపతులను లోక్ అదాలత్ కలిపింది. మహబూబాబాద్ జిల్లా గంగారం పోలీసు స్టేషన్ పరిధికి చెందిన బోడ అనూష, అనిల్ దంపతులు ఏడాది నుంచి దూరంగా ఉంటున్నారు. ఈ క్రమంలో డీఎస్పీ తిరుపతిరావు ఆధ్వర్యంలో గూడూరు సీఐ సూర్యప్రకాశ్, గంగారం ఎస్సై రవికుమార్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఫిర్యాది అనూషతో మాట్లాడి రాజీ కుదుర్చగా శనివారం లోక్ అదాలత్ సందర్భంగా కోర్టు డ్యూటీ అధికారి వెంకటేశ్వర్లు ఆ దంపతులను జిల్లా జడ్జి మహమ్మద్ అబ్దుల్ రఫీ సమక్షంలో మాట్లాడించారు. దీంతో తాము కలిసి ఉంటామని ఒప్పుకున్నారు. కాగా, జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహమ్మద్ అబ్దుల్ రఫీ వారిని అభినందించారు.

యూరియా వచ్చేసింది..

ఖిలా వరంగల్: వరంగల్ రైల్వేస్టేషన్ గూడ్స్ షెడ్‌కు శనివారం 2,644.150 మెట్రిక్ టన్నుల కోరమండల్ యూరియా వచ్చింది. దీంతో రైతులకు ఊరట లభించనుంది. వ్యవసాయ అధికారులు విజ్ఞాన్, రవీందర్‌రెడ్డి.. కంపెనీ ప్రతినిధులతో కలిసి యూరియా స్టాక్‌ను పరిశీలించారు. కలెక్టర్ సత్యశారద, డీఏఓ అనురాధ.. మార్క్‌ఫెడ్‌కు 60 శాతం, ప్రైవేట్‌ఫర్టిలైజర్ డీలర్లకు 40శాతం కేటాయించారు. వరంగల్ జిల్లాకు 424.15 మెట్రిక్ టన్నులు, హనుమకొండ 430, ములుగు 300, జయశంకర్ భూపాలపల్లి 400, జనగామ 450, మహబూబాబాద్ జిల్లాకు 440 మెట్రిక్ టన్నుల కేటాయింపులు జరిగాయి. శనివారం సాయంత్రం వరకు యూరియాను జిల్లా, మండల కేంద్రాలకు తరలించే కార్యక్రమాన్ని చేపట్టామని ఏఓ రవీందర్ రెడ్డి తెలిపారు.

మళ్లీ మొదటికి వచ్చినట్లేనా?

ఆ అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకంపై వినితనాయిని మళ్లీ రిట్ పిటిషన్

కౌంటర్‌దాఖలు చేయాలని రాష్ట్ర విద్యాశాఖ, ఉన్నత విద్యామండలి, కేయూకు హైకోర్టు ఆదేశం



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ 2010లో నియమితులైన వివిధ విభాగాల అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాన్ని ఆమోదిస్తూ ఈ ఏడాది మే 8న రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ జారీ చేసిన జీఓ 22ను సవాల్ చేస్తూ అప్పట్లో ఉద్యోగం రాని వినితనాయిని హైకోర్టులో ఈనెల 9న రిట్ పిటిషన్ దాఖలు చేశారు. రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ, ఉన్నత విద్యామండలి, కాకతీయ యూనివర్సిటీ, కేయూలో 2010లో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా నియమితులైన వారిని ప్రతివాదులుగా చేర్చారు. దీంతో హైకోర్టు ఈనెల 9న వాదనలు వింటూ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖకు, రాష్ట్ర ఉన్నత విద్యామండలికి, కాకతీయ యూనివర్సిటీకి కౌంటర్‌దాఖలు చేయాలని, 2010లో నియమితులైన అసిస్టెంట్ ప్రొఫెసర్లకు నోటీసులు జారీచేయాలని ఆదేశాలు ఇస్తూ ఈ కేసును అక్టోబర్ 9వ తేదీకి వాయిదా వేసింది.

మొదటి నుంచీ వివాదమే..

కాకతీయ యూనివర్సిటీలో 2010లో వివిధ విభాగాల్లో నియమితులైన అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలపై అప్పటి నుంచి వివాదం కొనసాగుతూనే ఉన్న విషయం విధితమే. అప్పట్లో ఉద్యోగాలు రాని పలువురు అభ్యర్థులు ఈ నియామకాల్లో అవకతవకలు జరిగాయనే ఆరోపణలతో హైకోర్టు, సుప్రీంకోర్టును ఆశ్రయించగా చివరికి పూర్తిస్థాయి పాలకమండలి సమావేశంలో ఆమోదించుకోవాలని సుప్రీంకోర్టు గతంలోనే సూచించింది. దీంతో 2019 నవంబర్‌లో కేయూ పూర్తిస్థాయి పాలకమండలి సమావేశంలో చర్చించి అవకతవకలు చోటుచేసుకున్నాయని భావించి ఆమోదించలేదు. దీంతో అప్పటి రిజిస్ట్రార్ తుది నిర్ణయం కోసం ఫైల్‌ను రాష్ట్ర ప్రభుత్వానికి పంపారు. ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా జాప్యం చేసింది. ఆ తర్వాత జరిగిన పరిణామాల నేపథ్యంలో కోర్టు ఆదేశాలతో జువాలజీ విభాగానికి చెందిన ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లను యూనివర్సిటీ అధికారులు కొంత కాలం క్రితమే ఉద్యోగాలనుంచి తొలగించిన విషయం విధితమే.ఆ తర్వాత కూడా ఉద్యోగం రాని వినితనాయిని అప్పటి నుంచి న్యాయం పోరాటం చేస్తూనే ఉన్నారు. మిగతా పలువురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు తమ ఉద్యోగాలు కాపాడుకోవడం కోసం కూడా హైకోర్టు, ఆ తర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయించారు. చివరికి సుప్రీంకోర్టు.. అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ తుది నిర్ణయం తీసుకోవాలని ఈఏడాది ఫిబ్రవరి 24న ఆదేశించిన విషయం విధితమే. ప్రభుత్వ ఆదేశాలతో రాష్ట్ర ఉన్నత విద్యామండలి నియమించిన కమిటీ నివేదిక ఆధారంగా ఉన్నత విద్యాశాఖ 2010లో నియమితులైన అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలపై(అప్రూవల్ చేస్తూ) సానుకూల నిర్ణయం తీసుకుని జీఓ 22ను ఈఏడాది మే 8న యూనివర్సిటీ అధికారులకు పంపింది. తదుపరి చర్యలను తీసుకోవాలని కూడా పేర్కొంది. ఇప్పటికే ఉద్యోగాలనుంచి తొలగించబడిన ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు జీఓలో మాత్రం అవకాశం కల్పించ లేదు. ఈక్రమంలో జూన్ 17న హైదరాబాద్‌లో నిర్వహించిన కేయూ పాలకమండలి సమావేశంలో 2010లో నియమితులైన వివిధ విభాగాల అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలపై చర్చించి ఆమోదించింది. దీంతో ఆయా అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఊపిరి పీల్చుకున్నారు. కేయూపాలకమండలి ఆమోదించడంతో వారంతా సంతోషించారు.

పదోన్నతులకు బ్రేక్‌పడినట్లేనా?

కేయూపాలకమండలి ఆమోదంతో ఆయా అసిస్టెంట్ ప్రొఫెసర్లు పదోన్నతుల కోసం నిరీక్షిస్తున్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ల నుంచి అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పించే ప్రక్రియ కూడా ఇటీవలే ప్రారంభించినట్లు తెలిసింది. పదోన్నతుల కల్పనకు యూనివర్సిటీ అధికారులు కూడా కొద్దిరోజుల్లోనే ఉపక్రమించబోతుండగా మళ్లీ అప్పట్లో ఉద్యోగం రాని వినితనాయిని.. ఉన్నత విద్యాశాఖ ఆయా అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలను ఆమోదిస్తూ సానుకూలంగా జారీచేసిన జీఓను సవాల్ చేస్తూ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేయడంతో వీరి సమస్య మళ్లీ మొదటికొచ్చినట్టైందని కాకతీయ యూనివర్సిటీలో చర్చ జరుగుతోంది. వీరికి ఇక ఇప్పట్లో పదోన్నతుల కల్పన ఉండబోదని, ప్రస్తుతానికి బ్రేక్ పడినట్లేనని భావిస్తున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట

- ఖోఖో అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాఘవరెడ్డి



మాట్లాడుతున్న జంగా రాఘవరెడ్డి

జఫర్‌గఢ్: గతంలో ఎన్నడూ లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు అధిక నిధులు కేటాయిస్తూ పెద్దపీట వేస్తోందని ఖోఖో అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి అన్నారు. మండలంలోని కూనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర స్థాయి 44వ సబ్ జూనియర్ ఇంటర్ షిప్ బాల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీలను శనివారం పాఠశాల పూర్వ విద్యార్థి, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జంగా రాఘవ రెడ్డి మాట్లాడుతూ గత పదేళ్ల కాలంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం క్రీడలకు మొండిచేయి చూపిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకుని క్రీడా రంగంలో తెలంగాణను అగ్రభాగాన నిలపాలన్నారు. మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించి స్ఫూర్తి చాటాలన్నారు. తల్లిదండ్రులు పిల్లలను చదువుతోపాటు క్రీడల్లో ప్రోత్సహించి వారి ఉజ్వల భవిష్యత్‌కు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గాదెపాక అయోధ్య, బాధ్యులు బంగారు స్వామి, బి.వి. రమణ, దర్గయ్య, వెంకట్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ తీగల కరుణాకర్‌రావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నూకల ఐలయ్య, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అన్నెబోయిన భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

నాడు శాంతిని నెలకొల్పడమే గాంధీ ధ్యేయం

- కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నవీన్



మాట్లాడుతున్న కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్

విద్యారణ్యపురి: దేశంలో స్వాతంత్ర్యానికి పూర్వం, స్వాతంత్ర్యం సిద్ధించాక నాడు శాంతిని నెలకొల్పడమే ధ్యేయంగా పనిచేసిన మహనీయుడు మహాత్మాగాంధీ అని కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్యనవీన్ అన్నారు. శనివారం హనుమకొండలోని నవీన్ రెసిడెన్సీలో ప్రజాకవికాళోజీ నారాయణరావు రచించిన బాపూ..బాపూ రెండో ముద్రణకావ్యాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భగా నిర్వహించిన సభలో ఆయన ముఖ్యఅతిథిగాపాల్గొని మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా గొప్ప రచయితలు మహాత్మాగాంధీ గురించి అద్భుతంగా రచించారన్నారు. గిరిజా మనోహరబాబు ఈ గ్రంథాన్ని పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో కాళోజీ ఫౌండేషన్ అధ్యక్షుడు నాగిళ్ల రామశాస్త్రి, బాధ్యులు పొట్లపెల్లి శ్రీనివాస్‌రావు, పందిళ్ల అశోక్‌కుమార్, కాళోజీ ఫౌండేషన్ పేరుతో గ్రంథాన్ని ముద్రించిన చింతకుంట్ల సంపత్‌రెడ్డి, రచయితలు గంటారామిరెడ్డి, ఆచార్య బన్న అయిలయ్య, బాసిరి సాంబశివరావు, నెల్లుట్ల రమాదేవి, డాక్టర్ ఆగపాటి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పగిలిన 'దేవాదుల'పైపులైన్

- ఎగిసిపడిన నీరు..
- నిండిన జయగిరి పాత చెరువు



పైపులైన్‌నుంచి ఎగిసిపడుతున్న నీరు

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం జయగిరి పాత చెరువు వద్ద దేవాదుల పైపులైన్ పగిలింది. ఇటీవల దేవాదుల నుంచి నీటిని విడుదల చేశారు. రెండు రోజుల క్రితం జయగిరి సమీపంలోని పాత చెరువు వద్ద పైపునకు చిన్న రంధ్రం పడింది. అది పెద్దది కావడంతో ఒత్తిడి పెరిగి పగిలింది. దీంతో ఒకేసారి నీరు ఉవ్వెత్తున ఎగిసిపడింది. ఆ నీరంతా సమీప చెరువులోకి చేరడంతో నిండి మత్తడి పోసింది. చెరువుకింద ఉన్న పంటపొలాలు ముంపునకు గురయ్యాయి. సమాచారం అందుకున్న నీటి పారుదలశాఖ ఎస్ఈ రాంప్రసాద్, ఈఈ మంగీలాల్, సునీత, డీఈఈ కిషన్ ప్రసాద్, తేజేశ్వర్‌రావు, ఏఈ శ్రీనివాస్‌లు ఘటన స్థలాన్ని చేరుకుని పరిస్థితి సమీక్షించారు. పులుకుర్తి వద్ద పంపింగ్‌ను నిలిపివేశారు..

రైలు నుంచి జారిపడి ప్రయాణికుడి దుర్మరణం

ఖిలా వరంగల్: ప్రమాదవశాత్తు శాతవాహన ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి జారి పడి ఓ ప్రయాణికుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన శనివారం చింతలపల్లి– ఎల్గూరు రైల్వేస్టేషన్ల మధ్య చోటు చేసుకుంది. జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ రాజు కథనం ప్రకారం.. వెస్ట్ బెంగాల్‌లోని తిల్న్ చౌదర్ గ్రామానికి చెందిన లాబాను కరుణాకర్ (41).. అబ్దుల్ సల్మాన్, రంజిత్ మరిడేతో కలిసి శాతవాహన ఎక్స్ ప్రెస్ రైలులో విజయవాడ నుంచి వరంగల్‌కు ప్రయాణిస్తున్నాడు. ఈక్రమంలో చింతలపల్లి– ఎల్గూరు రైల్వేస్టేషన్ల మధ్య కరుణాకర్ ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి పడి అక్కడికక్కడే దుర్మణం చెందాడు. మృతుడి బంధువులకు సమాచారం అందజేసి మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించినట్లు వరంగల్ జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ రాజు తెలిపారు.

ఉమ్మడి జిల్లా ప్రజలకు శుభవార్త

- రక్సోల్, సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ తిరుపతి వరకు పొడిగింపు
- 20 నుంచి అమలు

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్ మీదుగా రక్సోల్, సికింద్రాబాద్ (07052, 07051) వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను తిరుపతి వరకు పొడిగించినట్లు కాజీపేట రైల్వే అధికారులు శనివారం రాత్రి తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాతోపాటు ఇతర జిల్లాల నుంచి తిరుపతి వెళ్లే భక్తుల డిమాండ్ మేరకు రైలును పొడిగించినట్లు తెలిపారు. ఈ రైలు సెప్టెంబర్ 20వ తేదీన తిరుపతి–రక్సోల్, 23వ తేదీన రక్సోల్–తిరుపతికి బయలుదేరుతుందని అధికారులు తెలిపారు.

రేపటి నుంచి వరంగల్ మీదుగా ప్రత్యేక రైలు..

ఈ నెల 15 తేదీన వరంగల్ మీదుగా బిహార్‌లోని జోగ్‌బని–తమిళనాడులోని ఈరోడ్ వరకు అమృత్ భారత్ స్పెషల్ ట్రైన్‌ను నడిపించనున్నట్లు రైల్వే అధికారులు శనివారం తెలిపారు.

ఎక్స్‌ప్రెస్ వివరాలు..

ఈ నెల 15న జోగ్‌బని–ఈరోడ్ (06602) ఎక్స్‌ప్రెస్ వరంగల్ మీదుగా ప్రయాణించనుందని రైల్వే అధికారులు తెలిపారు. ఈ రైలుకు సికింద్రాబాద్ జోన్‌లో నాగ్‌పూర్, సేవాగ్రామ్, చంద్రాపూర్, బల్లార్షా, మంచిర్యాల, వరంగల్, ఖమ్మం, విజయవాడ, ఒంగోలు, గూడూరు, నాయుడుపేట స్టేషన్లలో హాల్టింగ్ కల్పించినట్లు తెలిపారు.

'వందే భారత్'కు మంచిర్యాలలో హాల్టింగ్

- రేపు ప్రారంభించనున్న కేంద్రమంత్రి బండి సంజయ్

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్ మీదుగా నాగ్‌పూర్–సికింద్రాబాద్ మధ్య ప్రయాణించే వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 15వ తేదీ నుంచి మంచిర్యాల రైల్వే స్టేషన్‌లో హాల్టింగ్ కల్పించనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ శనివారం తెలిపారు. మంచిర్యాల స్టేషన్‌లో ఈ నెల 15న కేంద్ర మంత్రి బండి సంజయ్ వందేభారత్ రైలును ప్రారంభించనున్నట్లు తెలిపారు.

వందేభారత్ ఎక్స్‌ప్రెస్ సమయ వివరాలు..

ప్రతీ మంగళవారం తప్ప మిగతా అన్ని రోజుల్లో నాగ్‌పూర్–సికింద్రాబాద్ (20101) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ నాగ్‌పూర్‌లో ఉదయం 5 గంటలకు బయలుదేరి 7: 20 గంటలకు బల్లార్షా, 08:49 గంటలకు మంచిర్యాల, 09:08 గంటలకు రామగుండం, 10:04 గంటలకు కాజీపేట జంక్షన్, 12:15 గంటలకు సికింద్రాబాద్‌కు చేరుతుంది. ప్రతీ మంగళవారం తప్ప మిగతా అన్ని రోజుల్లో సికింద్రాబాద్–నాగ్‌పూర్ (20102) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ సికింద్రాబాద్‌లో 13:00 గంటలకు, కాజీపేట జంక్షన్‌కు 14:28 గంటలకు, రామగుండంకు 15:23 గంటలకు, మంచిర్యాలకు 15:37గంటలకు, బల్లార్షాకు 17:25 గంటలకు, నాగ్‌పూర్‌కు 20:20 గంటలకు చేరుతుందని సీపీఆర్వో ఎ.శ్రీధర్ తెలిపారు.

న్యాయవాదులకు శిక్షణ తరగతులు అవసరమే



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న హైకోర్టు జడ్జి జస్టిస్ లక్ష్మణ్

- హైకోర్టు జడ్జి జస్టిస్ కె.లక్ష్మణ్

వరంగల్ లీగల్ : యువ న్యాయవాదులకు శిక్షణ తరగతులు అవసరమేనని తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ కె.లక్ష్మణ్‌గౌడ్ అన్నారు. శనివారం హనుమకొండ జిల్లా కేంద్రంలోని డీసీసీబీ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర న్యాయవాది పరిషత్ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా జడ్జి లక్ష్మణ్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి సీనియర్ న్యాయవాది కె.వి. గుప్తా రాసిన 'తెలంగాణ కోర్టు ఫీ యాక్ట్ పుస్తకం'ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జడ్జి జస్టిస్ కె.లక్ష్మణ్‌గౌడ్ మాట్లాడారు. యాంటీ కరప్షన్ లాస్, ప్రాక్టీస్ అండ్ ప్రొసీజర్ అంశాల్లో యువ న్యాయవాదులు మెళకువలు తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర న్యాయవాద పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు ఎల్.ప్రభాకర్ రెడ్డి, శ్యాంశాని సునీల్, చొల్లేటి రామకృష్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్షులు వలుస సుధీర్, పులి సత్యనారాయణ, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు

అమ్మవారికి హైకోర్టు జడ్జి పూజలు..

హన్మకొండ కల్చరల్ : శ్రీభద్రకాళి దేవాలయాన్ని శనివారం తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ కె. లక్ష్మణ్ సందర్శించి అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు భద్రకాళి శేషు, ధర్మకర్తలు.. జస్టిస్‌ను ఘనంగా స్వాగతించారు. పూజలనంతరం అర్చకులు శేషవస్త్రాలు, మహాదాశీర్వచనం అందజేశారు. కార్యక్రమంలో న్యాయమూర్తి పట్టాభి రామారావు, వరంగల్ జిల్లా న్యాయమూర్తి నిర్మలా గీతాంబ తదితరులు పాల్గొన్నారు.

ఓటమిని గెలుపుగా మలుచుకోవాలి

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క
- ముగిసిన రాష్ట్ర స్థాయి క్రీడలు



గంధారి జట్టుకు బహుమతి అందజేస్తున్న మంత్రి సీతక్క, ఎస్పీ రాంనాథ్‌కేకన్

కొత్తగూడ: క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓడిన వారు నిరాశపడకుండా గెలుపు కోసం మరోసారి ప్రయత్నించాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం పొగుళ్లపల్లి ఈఎంఆర్‌ఎస్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి క్రీడల ముగింపు కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. విద్యార్థి దశ నుంచి క్రీడలు, చదువులో ప్రతిభచాటాలన్నారు. ప్రస్తుత క్రీడల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఒడిశాలో జరిగే జాతీయ స్థాయి క్రీడల్లో పతకాలు సాధించి రాష్ట్రానికి పేరు తీసుకురావాలన్నారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచి నాణ్యమైన భోజనం అందిస్తున్నామన్నారు. అనంతరం ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించిన కామారెడ్డి జిల్లా గంధారి ఈఎంఆర్‌ఎస్‌కు, అలాగే వివిధ విభాగాల్లో గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, ఆర్డీఓ కృష్ణవేణి, స్పోర్ట్స్ ఆఫీసర్ వీర్యనాయక్, ఆర్సీఓ రత్నకుమారి, రాష్ట్ర ఉపాధిహామీ సంస్థ డైరెక్టర్ చల్ల నారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ అజయ్‌సింగ్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్పీతో మంత్రిప్రత్యేక సమావేశం..

ఈఎంఆర్‌ఎస్‌లో క్రీడల ముగింపు కార్యక్రమానికి వచ్చిన మంత్రి సీతక్క.. ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్‌తో పాఠశాలలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సమావేశానికి ఎవరిని లోపలికి అనుమతించకపోవడం గమనార్హం. జిల్లాలో యూరియా పంపిణీ గురించి ఎస్పీని అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. కొత్తగూడ, గంగారం మండలాల్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఎస్పీకి సూచించినట్లు తెలుస్తోంది.

ప్రభుత్వ పాఠశాలలకు చేయూత

- ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ



జులైవాడ ప్రభుత్వ హైస్కూల్ హెచ్‌ఎంకు చెక్కు ఇస్తున్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, చిత్రంలో జోస్ అలుక్కాస్ యాజమాన్యం

విద్యారణ్యపురి: కార్పొరేట్ సామాజిక బాధ్యత పథకం కింద హనుమకొండలోని జోస్ అలుక్కాస్ నగల దుకాణం, వరంగల్, హనుమకొండ, కాజీపేటలోని ఆరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు సుమారు రూ.11.75 లక్షలకు పైగా విలువైన వివిధ వస్తువులు కంప్యూటర్ల కోసం చెక్కులు పంపిణీ చేశారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి చేతుల మీదుగా.. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు ఆ నగల షాప్‌నకు సంబంధించి మేనేజర్ ఇతర ప్రతినిధులు పంపిణీ చేయించారు. హనుమకొండ జులైవాడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం భాస్కర్‌రెడ్డికి రూ.2.15 లక్షల చెక్కును ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ నగదుతో ఆరు కంప్యూటర్లు జోస్ అలుక్కాస్ యాజమాన్యం ఇవ్వనుందని హెచ్‌ఎం భాస్కర్‌రెడ్డి తెలిపారు. అలాగే లష్కర్‌బజార్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు 2.9 లక్షలతో 150 లీటర్లకు సంబంధించిన వాటర్ కూలర్, 4 కంప్యూటర్లు అందించనున్నారు. కాజీపేట జాగీర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు రూ.2.1 లక్షతో ఒక ప్రొజెక్టర్, ఒక వాటర్ కూలర్, రెండు కంప్యూటర్లు అందించనున్నారు. వరంగల్‌లోని రైల్వేగేట్ పెరకవాడలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు రూ.2.9 లక్షలు, కాజీపేటలోని బాలుర ప్రభుత్వ పాథమిక పాఠశాలకు రూ. 1.21 లక్షల చెక్కును, వేలేరులోని మండల ప్రజాపరిషత్ స్కూల్‌కు రూ.2.26 లక్షల చెక్కును ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు అందజేశారు. ఆయా డబ్బులతో జోస్ అలుక్కాస్ నగల షాపు యాజమాన్యమే ఆయా స్కూల్స్‌కు అవసరమైన కంప్యూటర్లు, వివిధ వస్తువులను కొనుగోలు చేసి ఇవ్వనుంది. కార్యక్రమంలో జోస్ అలుక్కాస్ హనుమకొండ మేనేజర్ టి.స్మితీష్, అసిస్టెంట్ మేనేజర్ గిరీష్, అకౌంట్స్ మేనేజర్ సుధీప్ తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా పంటల లెక్క

- క్షేత్రస్థాయిలో సర్వే చేస్తున్న ఏఈఓలు
- హనుమకొండ జిల్లాలో 125 గ్రామాలు, 55 క్లస్టర్లు
- 2,21,163 ఎకరాల్లో పంటల సాగు




డిజిటల్ క్రాప్ సర్వే చేస్తున్న ఏఈఓలు

హన్మకొండ: వానా కాలం పంటల సాగు లెక్కలు కచ్చితంగా తేల్చేందుకు ప్రభుత్వం డిజిటల్ క్రాప్ సర్వే చేపట్టింది. వ్యవసాయ విస్తరణాధికారులు మొబైల్ ఫోన్‌లోని ప్రత్యేక యాప్‌లో డిజిటల్ క్రాప్ సర్వే చేస్తున్నారు. సాగు చేసిన పంటల ఫొటోలు కూడా యాప్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. ఇంతకు ముందు అంచనాల ఆధారంగా పంటలు నమోదు చేసేవారు. అయితే, కచ్చితత్వం కోసం పంటలను భౌతికంగా చూడడం ద్వారా పంటల సాగు ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతోంది. తద్వారా ప్రభుత్వం మార్కెటింగ్ సౌకర్యం, ఇతర సౌకర్యాలు, ఇతరత్రా ఏర్పాట్లు, నిర్ణయాలు తీసుకోవడానికి ఆస్కారం ఏర్పడుతుంది.

జిల్లాలో 14 మండలాల్లోని 125 గ్రామాల్లో 55 క్లస్టర్లున్నాయి. 55 మంది వ్యవసాయ విస్తరణాధికారులు (ఏఈఓ)లు సర్వేలో మునిగిపోయారు. జిల్లాలో 2,21,163 ఎకరాల్లో పంటలు సాగుచేస్తున్నారు. వరి 1,38,803 ఎకరాలు, పత్తి 74,849 ఎకరాలు, మొక్కజొన్న 7080, పప్పు దినుసులు 395, నూనెగింజల పంటలు 32 ఎకరాలతో పాటు ఇతర పంటలు సాగు చేశారు. పురుష ఏఈఓలు 2 వేల ఎకరాల్లో, మహిళా ఏఈఓలు 1800 ఎకరాల్లో డిజిటల్ క్రాప్ సర్వే చేస్తారు. ఈమేరకు సర్వే నంబర్ల వారీగా ఏఈఓలకు పంటల సర్వే విస్తీర్ణాన్ని కేటాయించారు. ఇంటర్నెట్ కనెక్టివిటీ తక్కువగా ఉన్న ప్రదేశాల్లో పంట బుకింగ్ పూర్తి చేయడానికి వీలుగా ఈ యాప్ ఆఫ్‌లైన్ ఫీచర్‌తో రూపొందించారు.

వరి సాగు ఏ పద్ధతిలో చేశారో కూడా నమోదు చేసేలా యాప్‌ను రూపొందించారు. పంట విత్తిన వివరాలు నమోదు ద్వారా ఆ పంట ఎప్పుడు కోతకు వస్తుందో అంచనా వేయడం ద్వారా పంట కొనుగోలు/సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేసుకునేందుకు ప్రణాళిక రూపొందించుకునే అవకాశముంటుంది. పంట బుకింగ్ 90 శాతం బుకింగ్ చేయగానే రైతు మొబైల్‌కు ఆరు సందేశాలు వెళ్తాయి. పంటల సాగులో తేడాలుంటే ఏఈఓను కలిసి సందేహాలు నివృత్తి చేసుకోవాలి.

పంటలు నమోదు చేయించుకోవాలి..



రైతులు స్వచ్ఛందంగా పంటలు నమోదు చేయించుకోవాలి. అక్టోబర్ 25లోపు డిజిటల్ క్రాప్ సర్వేలో పంటల సాగు వివరాలు నమోదు చేసుకోవాలి. ఏఈఓలు క్షేత్ర స్థాయికి చేరుకుని డిజిటల్ క్రాప్ సర్వే చేస్తారు. రైతులు సర్వే నంబర్, పంటల వారీగా వివరాలు నమోదు చేయించుకోవాలి.

– రవీందర్‌సింగ్, జిల్లా వ్యవసాయాధికారి

అక్టోబర్ 25 వరకు పూర్తిచేయాలి..

జిల్లాలో అక్టోబర్ 25 వరకు పంటల బుకింగ్ పూర్తి చేయాలి. అదే నెల 27న గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో డిజికల్ క్రాప్ సర్వే వివరాలు ప్రదర్శిస్తారు. నవంబర్ 1న రైతుల నుంచి అభ్యర్థనలు స్వీకరిస్తారు. 3న అభ్యర్థనలను క్షేత్ర స్థాయికి వెళ్లి పరిశీలిస్తారు. 5న తుది సర్వేను ప్రదర్శిస్తారు.

వివరాలు నమోదు చేయకుంటే ఇబ్బందులు..

పంటల వివరాలు, సాగు విస్తీర్ణం నమోదు చేసుకోకుంటే పంట ఉత్పత్తుల విక్రయాల సమయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశముందని అధికారులు తెలిపారు. కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన తర్వాత ఆన్‌లైన్‌లో ఉన్న సాగు విస్తీర్ణం మేరకు వచ్చే పంట దిగుబడి అంచనాకు సరితూగాలి. తేడా లుంటే పంట ఉత్పత్తుల చెల్లింపులు ఆలస్యమవుతాయి. పథకాలు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పరిహారం పొందడం, బీమా వర్తింపు వంటి సాయం అందించడానికి ప్రభుత్వం వద్ద పక్కా సమాచారం ఉంటుంది.